


# 'ఏ ' సర్టిఫికెట్

- కె.రామలక్ష్మి

(1978 జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక )

**నలభై దాటాక పార్వతికి** అన్నీ అనుమానాలే.

"నువు ఉట్టి అనుమానాల పుట్టలాగా తయారయ్యావు పార్వతీ" అని కృష్ణమూర్తి విసుక్కోని రోజు వుండడంలేదు. అతను విసుక్కుంటే పార్వతి బాధపడక తప్పదు.

"ఏం చెయ్యను కృష్ణా? ఎదిగిన పిల్లలున్న తరువాత యిలాంటి యిబ్బందులు తప్పవు" అనేస్తుంది.

"కాని యింకెవరికీ యెదిగి పిల్లలు లేరా? అంతమాత్రం చేత పెద్దాళ్ళు సరదాలన్నీ చంపేసుకుని సన్యాసుల్లాగా బ్రతుకుతున్నారా చెప్పు? మా ఆఫీసులో.."

కృష్ణమూర్తి మాట ఎప్పుడూ పూర్తికానివ్వదు పార్వతి.

"మీ మేనేజరుకి అరవై వస్తుండగా కొడుకు పుట్టాడు" కిసుక్కున నవ్వేస్తుంది పార్వతి. కొంపలో యిదో పెద్ద జోక్ అయిపోయింది. నానిగాడికి బాబ్జీ యిలాంటి 'ఎడల్టు' జోకులు అర్ధం కావనుకుంటుంది పార్వతి. వాళ్ళముందు నోరు జారకూడదని నిఘా.

కృష్ణమూర్తి యిలాంటి సమయాల్లోనే 'యెలాంటి పార్వతి యెలా రూపాంతరం చెందిందీ' అనుకుంటాడు. చాలా ఆల్ట్రా మోడరన్‌గా వుంటూ ఇటు చెంచా అటు పెడితే గోళ్ళ షేపు పాడవుతుందనుకునే పార్వతి భర్త వచ్చేసరికే కాస్త మారిపోయింది. మంచి చీరలో అపర రతీదేవిలా కళ్ళు కుట్టేస్తూంటే గభాలున కౌగలించుకోబోయిన కృష్ణమూర్తిని "స్టాప్ స్టాప్. చీర నలిగిపోతుంది. మనం బయటికి వెడుతున్నాం మరిచిపోయావా?" అంటూ అంగుళాల దూరంలో ఆపేస్తుంది. "బయటివాళ్ళకేనా యింత అందం" అని ఉడుక్కుంటే, అలా చలాగ్గా కౌగలించుకోనిచ్చి"ఇంట్లో నీకోసం నా అవతారం

వేరేవుంది లేవోయ్ పదపద" అని దాటవేసేది. ఇక పిల్లల రాకతో కొంపలో భార్యాభర్త సరసాలూ సరాగాలూ ఆల్‌మోస్టు దొంగ పనులుగా మార్చేసింది పార్వతి.

నాలుగైదునెలల నానిగాడిని పక్కలో పడేసుకునే రోజుల్లో కూడా పైన చేయివేయనిచ్చేది నాని చూడ్డా అని. 'మైగాడ్! ఈ ఆడాళ్ళకి మతిలేదు.' అనుకునేవాడు కృష్ణమూర్తి.

ముగ్గురు పిల్లలు పుట్టినా తొలినాటి కొంటెతనంగాని, వయస్సు తెచ్చిన జాణతనంగాని కొంచెం కూడా తరగని పార్వతి కృష్ణమూర్తికి ఎప్పుడూ ఆకర్షణే. ఎప్పుడూ ఆవేదనే.

కాని తల్లుల కళ్ళు పిల్లలే తెరిపిస్తారన్నది నిజం చేశాడు ఓ రోజు బాబిగాడు. వాడికో పెద్ద అనుమానం. బేబీతో చర్చిస్తూ.

"అసలు మమ్మీ డాడీ ఫ్రెండ్స్ కారు, ఎనిమీస్" అన్నాడు.

పిచ్చి బేబీకి మమ్మీని యెవరేమన్నా ఫరవాలేదుగాని డాడీని ఏమీ అనకూడదు.

"డాడీ మంచివాడే బాబీ, మమ్మీ..ఛీ. పొండి అని స్నేహంగా వుండదు. నేనెన్నోసార్లు చూశాను" అంది నెమ్మదిగా.

వంట గదిలోంచి బయటికి రాబోయిన పార్వతి వాళ్ళ మాటలు చెవిని పడగానే అడుగు ముందుకు వేయలేకపోయింది.

"ఏం చూశావే బాబీ. మా సూరిగారి మమ్మీలేదూ.."

వాడి మాట పూర్తికాకుండానే గట్టిగా నవ్వేస్తూ –

"వాడి మొహం, వాడికి మమ్మీ కాదది. వాళ్ళ నాన్న వుంచుకున్నాట్ట. అందుకే దాన్ని మమ్మీ అనడువాడు. అదీ అదీ అంటాడు. నీకా మాత్రం తెలియదా?" అడిగింది పెద్ద ఆరిందాలాగా.

"నాకేం తెలుసూ, నేను వాడితో వెడితే మీరు పోయి ఆడుకోండి అని గదిలో దూరి తలుపులు వేసుకున్నారు. బేబీ అమ్మకి చెప్పకేం ఓ సంగతి చెప్తాను" రహస్యంగా అడిగాడు. ప్రామిస్ అంది బేబీ.

"మేం కిటికీలోంచి చూశాం. వాళ్ళకి తెలియదనుకో. ఛీ, పాడు మరేం..." పార్వతి గుండెలు దడదడ కొట్టుకున్నాయి. యికపై వాడేం చెప్తాడోనని.

"బాబీ" కోపంగా అరిచింది. ఏం లేనిదానికి మమ్మీ ఎందుకంత గట్టిగా అరిచిందో అర్థంకాలేదు బాబీకి. "ఏం మమ్మీ" అన్నాడు భయంగానే. పిల్లలందరికీ తెలుసు నాన్నతో దెబ్బలాడిన రోజున మమ్మీ ఇలాగే రుసరుసలాడుతూ వుంటుంది ప్రతి చిన్నదానికీ అని.

"మీకు స్కూలేకపోతే నాకూ పని వుండదనా వెధవా వెళ్ళు నీళ్ళకి" కసిరింది. బాబీ కేసి ఓ దొంగచూపు చూసి బాత్‌రూం కేసి పరుగు తీశాడు.

బేబీ మెల్లిగా తండ్రి కుర్చీ వెనక్కి నడిచింది.

గోముగా తండ్రి మెడచుట్టూ చేతులు వేసి గెడ్డం తండ్రి తలకి ఆంచి "డాడీ" అంది.

"ఏరా? నీకూ స్కూల్లేదా?" కూతురి తలమీదికి రెండు చేతులూ వేస్తూ అడిగాడు కృష్ణమూర్తి.

"సిల్లీ డాడీ ఈరోజు మీ ఆఫీసుకి ఎందుకు సెలవు?" అడిగింది.

"రంజానట" అనాడు.

"మాకుండదా? డాడీ నా ఫ్రెండ్ రజియా యింట్లో గొప్ప పండగ చేస్తారట. మనం కూడా రంజాన్ చేసుకుందాం. చక్కటి బట్టలు జిగేల్ మనేవి కుట్టించుకోవచ్చు" అంది.

"మనకీ వుందిగా దీపావళి."

"ఛీ ఎప్పుడూ టపాకాయలూ, పట్టు పరికిణీ. బోర్" విసుగ్గా అని బుంగమూతి పెట్టి తండ్రి ముందుకి వచ్చి పాదాల దగ్గర కూలబడింది.

"పోనీ చెప్పు మరేం చేద్దాం" కుతూహలంగా కూతురి ముఖంలోకి చూస్తూ అడిగాడు కృష్ణమూర్తి.

"మీ గారాలపట్టి ముద్దూ ముచ్చటలకేంగాని ఈ పూట అమ్మ వస్తుంది. సాయంత్రం మనం ఏదయినా సినిమాకి వెడదాం" అంది పార్వతి.

తల్లి ముఖంలోకి చాలాకోపంగా చూసింది బేబీ. దానికి తల్లిమీద అంత అభిమానం వున్నా అంతకంతా కోపం ప్రతిపనికీ అడ్డుచెప్తుందని "నేనూ వస్తానయితే" అంది.

"అమ్మమ్మ వస్తూంది. చక్కగా కథలు వింటూ ఆడుకోవాలి" అంది పార్వతి.

పొయ్యిమీద పాలకుక్కర్ కూత సెంట్రల్లో రైలు కూతలా వుంది. యింకేం అనకుండానే లోపలికి పరుగెత్తింది పార్వతి.

"డాడీ, రజియా లేదూ యీ అమ్మ కోప్పడితే ఇంకో అమ్మ దగ్గరికి పరుగెడుతుంది. ఈ అమ్మ యివ్వనంటే ఇంకో అమ్మ దగ్గర తీసుకుంటుంది. మనకీ యింకో అమ్మ వుంటే బాగుండును డాడీ"

చాలా ఆలోచనలో పడిపోతున్నట్టుంది దానిమాట.

కృష్ణమూర్తి నవ్వుకున్నాడు. "నీ ఐడియా అమ్మకు చెప్పు బేబీ, ఏమంటుందో.." అన్నాడు.

"అమ్మబాబోయ్ నే చెప్పను. నువ్వే కొట్టి ఒప్పించు" అంది.

"మమ్మీని కొట్టా?" ఆశ్చర్యంగా అడిగాడు కృష్ణమూర్తి. ఇలాంటి ఊహ యీ చిన్నారికెలా తోచిందని అతని అనుమానం.

"అవును కొట్టకపోతే ఒప్పుకుంటుందా? మొన్న మా స్నేహితురాల్లేదూ" చేతులు తిప్పుతూ ప్రారంభించింది బేబీ.

"రజియానా?"

"కాదు అదే మీ క్లబ్బులో పేకాడరూ సుబ్బారావుగారు. వాళ్ళమ్మాయి డాడి. ఆయనకి ఇద్దరు పెళ్ళాలు. మళ్ళీ అప్పుడప్పుడు కొత్త ఆంటీలని తెస్తారట."

"బేబీ! యివన్నీ నీకెవరు చెప్పారు?" కాస్త కోపంగా అడిగాడు కృష్ణమూర్తి. కోపం తెచ్చుకోడంలో అర్థం లేదని తెలుసు. కాని యివి పిల్లలు చర్చించుకోతగ్గ విషయాలా అని.

"ఆ అమ్మాయే చెప్పింది డాడీ, పాపం వాళ్ళమ్మ ఏడుస్తుందిటగాని, వాళ్ళ నాన్న మాట కాదనదట. మరి మన మమ్మీ చూడు."

"ఏం మన మమ్మీకి ఏం?"

"అన్నీ కోపాలే. అన్నీ రహస్యాలే. నీతో మాట్లాడుతుందా? మమ్మల్ని విననివ్వదు... అసలు నీతో..." బేబీ మాట పూర్తిచేస్తే ఏం చేయాలో తెలియని కృష్ణమూర్తి "చూడు బేబీ, మమ్మీకి మీరు ముగ్గురు అంటే ప్రాణం కదా అందుకే మీకోసం..."

"ఛీ, మొగుడూ పెళ్ళాలు తలుపులేసుకుని గుసగుసలాడుకుంటారు. స్నేహంగా వుంటారు. యింకా..."

"వద్దులే. మమ్మీతో నేను మాట్లాడతాను" అనేశాడు కృష్ణమూర్తి.

"డాడీ, సినిమాకి నేనూ వస్తా. నా స్నేహితులంతా చూశారు."

"ఏది?"

"సత్యం శివం సుందరం దానిలో లేదూ."

"బేబీ అది పెద్దవాళ్ళ సినిమా. పిల్లలు చూడకూడదు.

"ఏం లేదు. దాంట్లో చిన్న రూపా జాకెట్టు వేసుకోలేదు. పెద్ద రూపా జాకెట్టు వేసుకోలేదు. దాని బాయి కనిపిస్తే హాల్లో ఈలలు వేశారుట. నా ఫ్రెండు చెప్పింది"

కృష్ణమూర్తి ముఖం ఉబ్బిపోయింది. ఎటు చూడాలో కూతురికి ఏం చెప్పాలో తెలియలేదు. 'పార్వతీ!' గట్టిగా కేక వేశాడు.

చేయి కొంగున తుడుచుకుంటూ వచ్చి "ఏం కృష్ణా కాఫీ కావాలా?" అడిగింది.

పొయ్యి వేడికి బుగ్గలు కంది వున్నాయి పార్వతికి. చెదిరిన జుట్టూ చెవుల వెనక్కు తోసి అట్టే పెట్టాలని తాపత్రయపడుతోన్న పార్వతి అప్రయత్నంగా కృష్ణమూర్తి ముఖంలోకి చూసింది.

కృష్ణమూర్తి చూపులు పార్వతి ముఖంమీద లేవు. సర్వత్రా చూస్తున్నట్టు వేకెంటుగా వుందా చూపు. అప్రయత్నంగానే పార్వతి పైట చెంగు సరిచేసుకుని కోపంగా చూసింది కృష్ణమూర్తి కేసి. 'ఏమిటా చూపు?' అన్న కసిరింపు వుందామె చూపులోనే.

"బేబీ వెళ్ళు నూకాలు తలకి నూనె రాస్తుంది" అని కూతుర్ని అక్కణ్ణుంచి తరిమేసింది.

"నాకు తలంటు వద్దు" అంటూనే కోపంగా కూర్చున్న చోటునుంచి లేచింది బేబీ. తండ్రితో చాలా రసవత్తరమైన విషయాలు చర్చించాలనుకుంది. 'కాని మా మమ్మీకి ఉట్టి జెలసీ' అనుకుని లేచి చక్కాపోయింది. కూతురు గది దాటిపోయేదాకా మాట్లాడలేదు కృష్ణమూర్తి. బేబీ గది దాటగనే అతని పెదవులపై చిన్న నవ్వు కళ్ళలోకి కొంటె వెలుగు వచ్చాయి.

"ఏమిటా చూపు? పిల్లలున్నారనేనా లేకుండా" అంటూనే భర్త కుర్చీ చేతిమీద సుతారంగా కూర్చుంటూ "ఏమిటీ మీ సుపుత్రి నూరిపోస్తోంది?" అడిగింది.

"మరి నువ్వు బాధపడకూడదు" అన్నాడు తీక్షణంగా.

"ఏం 'ఏ' సర్టిఫికెట్ కథలు చెప్తూందా?" నవ్వుతూనే అడిగింది.

"నీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగాడు.

"నీ ముఖం చూస్తేనే తెలిసింది. చెవుల చివర్లదాకా అలా ఎర్రపడిపోతే" నవ్వింది.

"నీ బేబీ పేరు మార్చేయాలి పార్వతి. అది సత్యం శివం సుందరానికి వస్తుందిట. దాని స్నేహితులంతా చూశారట."

"వాళ్ళమ్మలకి బుద్ధిలేదు. నాకూ లేదా?" కోపంగా అందేగాని బేబీ, చిన్న కొడుకూ మాట్లాడుకోడం విన్న పార్వతి కోపంలో అంత వాడిలేదు.

"వీళ్ళిలా తయారవుతున్నారేం కృష్ణా? నేనెక్కడ ఫెయిల్ అయ్యాను? వాళ్ళకోసం...నేను..." నసిగింది పార్వతి.

"నువ్వు నాతోకూడా చనువుగా వుండడానికి వెనకాడేటంత జంకుతున్నావు, అవునా పార్వతి. నీ పిచ్చిగాని ఎదిగే పిల్లల దృష్టి వేటిమీద వుంటుందో వాటిమీదనుంచి మళ్ళించాలని తాపత్రయపడ్డం శుద్ధ దండగ. నువ్వు వద్దన్నకొద్దీ వాళ్ళ మనస్సు వాటివైపు మొగ్గుతుంది. వాళ్ళతోపాటు మనం 'ఏ' సర్టిఫికేట్‌కి వెళ్ళకూడదన్నావు. అంతమాత్రం చేత ఏం జరిగింది? వాళ్ళకి నీకంటే ఎక్కువ తెలిసింది. నవ్వుతూ భార్య నడుం చుట్టూ చేయి వేశాడు. ఏదో ఆలోచనలో వున్న పార్వతి ఆ చేయి తీసేయలేదు.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" అడిగాడు.

"ఏంలేదు. నాకేమీ అర్థం కావడంలేదు" నెమ్మదిగా అంది పార్వతి.

"పిచ్చి పార్వతీ లోకాన్ని చూడు. నీ నాలుగ్గోడల మధ్యా నీ రూల్సు. కాని బయట ప్రపంచంలో ఎలా? నీ పిల్లలకి గంతలు కట్టి పంపించగలవా బయటికి? యెన్నాళ్ళు, ఎన్నేళ్ళు? పెద్దల సినిమాలు పిల్లలు చూడకూడదన్నారు సరే. మరి పెద్దల సినిమా బొమ్మలు పత్రికల్లో, పోస్టర్లు రోడ్లమీద చూస్తున్నారు కదా? అవి 'ఏ' కాదా? అవి అనవసరంగా వాళ్ళలో అర్థంకాని ఆలోచనలు రేకెత్తించవా? ఈ ప్రపంచం విస్తరించిన ప్రచార సాధనాలవల్ల చాలా కుంచించుకుపోయింది పార్వతీ. నీవు ఒక్కత్తెవీ వాటి ప్రభావం నుంచి నీ పిల్లల్ని రక్షించలేవు, అది జ్ఞాపకం వుంచుకో. ఇంట్లో చూడనివ్వని పుస్తకం పక్కింట్లో చూస్తారు. చూడకూడదన్న సినిమా గురించిన పోస్టర్లు దారి పొడుగునా చూస్తూ స్కూలికి వెడతారు."

"కృష్ణా, అయితే వీళ్ళు నన్ను చూసి పిచ్చిదనుకుంటున్నారా? నా వెనక నవ్వుకుంటున్నారా? ఇందాక బాబీ యెలా చూశాడో తెలుసా?" జారిపోతూవున్న నమ్మకాన్ని కూడగట్టుకుంటున్న ప్రయత్నంలాగా వుంది పార్వతి కంఠస్వరం.

ఇన్నాళ్ళూ ఆమె ఊహిస్తున్న ఊహలని సమూలంగా తోసేస్తున్నాయి కృష్ణమూర్తి మాటలు, పిల్లల మాటలు.

"నీ పిచ్చిగాని అమ్మా నాన్నా తలుపులు వేసుకోవడం పిల్లలకి సహజంగా తోచాలిగాని వింతగా తోచకూడదు. అతి జాగ్రత్తలు యిలా అనుమానాలకే దారితీస్తాయి. అంచేత" అంటూ పార్వతి ముఖంలోకి కొంటెగా చూశాడు కృష్ణమూర్తి.

"సరే! యింక తమరూ స్వేచ్ఛ ప్రకటించాలనేగా. ఏమయినా సరే తల్లితోపాటు తండ్రీ పిల్లలని రూపు దిద్దడంలో సాయపడాలి. నువ్వా పని చేయడంలేదు" నిష్ఠూరం ధ్వనిస్తూ అంది పార్వతి.

"నా పని నేను ఎప్పుడూ సూటిగా చేస్తూనే వున్నాను పార్వతి. సూటి ప్రశ్నకి సూటి జవాబు. అంతేగాని నీలాగా ఎర్రబడిపోయి కసిరేస్తే లాభంలేదు."

"అందుకే కాబోలు పొయ్యి దగ్గర వున్న నాకంటే ఎర్రబడిపోయారు తమరు నే వచ్చేసరికి" దెప్పింది పార్వతి.

కృష్ణమూర్తికి బేబీ మాట జ్ఞాపకం వచ్చింది. కాని భార్యకెలా చెప్తాడు.

"నీ కూతురు ఈ కాలం పిల్ల. దానికి దాపరికాల్లేవు. నేను యింకా కాస్త పాతవాడిని కదా అందుకు ఎర్రబడ్డాను. సరే ఈ పూట సినిమాకి?" మాట మార్చాడు.

"అందరూ అయితే ఏదయినా మంచి సినిమాకి వెడదాం."

"అంటే 'యు' అనా? బేబీనడుగు చెపుతుంది" అన్నాడో లేదో అప్పుడే వస్తున్న బేబీ "డాడీ అది బోర్. ఎంతసేపూ వాన తడిసిపోయి అసహ్యం... బోర్ పాటలు, బోర్ మనుషులు బాగుండదు. మనం సత్యం శివాని కెడదాం డాడీ" తండ్రి ఒళ్ళోకి చేరేదేకాని పార్వతిని చూసి ఆగింది.

"అవి పెద్దవాళ్ళ సినిమాలు బేబీ. పిల్లల్ని వదలరు."

"లేదు నా ఫ్రెండ్ వెళ్ళింది. నేనూ చూడాలి" తండ్రికేసి చూస్తూ "డాడీ పెద్దాళ్ళ సినిమాలకీ, పిల్లలు కూడా చూసేవాటికీ ఏం తేడా వుండదట బాబీ చెప్పాడు."

"ఏమని చెప్పాడు బాబీ?" అడక్కూడదనుకుంటూనే కుతూహలాన్ని అణచుకోలేక అడిగేశాడు కృష్ణమూర్తి.

"పెద్దవాళ్ళ సినిమాల్లో ముద్దు పెట్టుకుంటారట. చిన్నవాళ్ళు చూసేవాటిలో చెట్ల వెనక దాక్కుని పెట్టుకుంటారట. 'యు' వాట్లలో గది తెలుపులు వేసుకోగానే సీను మార్చేస్తారంట, కాని 'ఏ' వాటిలో గదిలో ప్రేమించుకోవడం చూపిస్తారంట. మరి.."

"చాలు బేబీ నువ్వెళ్ళి రడి అవు. దేనికో దానికి వెడదాంలే" కసిరింది పార్వతి.

"నేనా సర్కస్ సినిమాకి రాను. అంతే" అడుగులు తపతప వేస్తూ అక్కణ్ణుంచి కదిలింది బేబీ.

పార్వతి నవ్వాపుకోలేకపోయింది.

కృష్ణమూర్తి ముఖంలోకి చూసి పగలబడి నవ్వడం ప్రారంభించింది. ఆమెనలాగే కౌగిట బిగిస్తూ –

"పిచ్చి పార్వతి కళ్ళ పొరలు యిప్పటికి ఊడుతున్నాయి" అన్నాడు కృష్ణమూర్తి.

సాయంత్రం సినిమా – అది వేరే కథ. వెడదామనుకున్నదానికి టిక్కట్లు దొరక్క యింకో 'యు' దానికే వెళ్ళారు. పార్వతీ కృష్ణమూర్తి పిల్లల్ని తీసుకుని. సినిమా బ్రహ్మాండమైన రేప్‌తో ప్రారంభం అయింది.

"అలా బట్టలేసుకుంటే అంతే చేయాలి" అన్నాడు నెమ్మదిగా నాని.

"ష్! మమ్మీ చంపేస్తుంది. నోరు మూసుకో" అంతకంటే నెమ్మదిగా అన్నాడు బాబ్జీ. ఆ కేకలు, ఆ నేపథ్య సంగీతం, ఆ మనుషుల ముఖాలు చూసి తల్లి చేయి గట్టిగా పట్టుకుంటూ "మమ్మీ నాకు భయమేస్తోంది" అంది వస్తూన్న దుఃఖాన్ని దిగమింగుకుందుకు తాపత్రయపడుతూ బేబీ.

ఆ మాట విని కిసుక్కున నవ్వాడు నాని.

మాట్లాడకుండా కూతుర్ని దగ్గరకు తీసుకుంటూ "ఏం జరిగిందమ్మా, అదంతా నటనే. భయంగా వుంటే కళ్ళు మూస్కో" అంది పార్వతి.

"చచ్చిపోతుందా...?" భయంగా అడిగింది.

"చచ్చిపోదమ్మా" ఓర్పుగా సమాధానం చెప్పింది పర్వతి.

"కడుపొస్తుందా?" బేబి మళ్ళీ అడిగింది.

పార్వతి సమాధానం చెప్పలేదు.

"అలా చేస్తే పిల్లలు పుడతారు. ఆ పిల్లల్ని కుప్ప తొట్టిలో పారేస్తారు. వాళ్ళు చచ్చిపోతారని చెప్పింది నా ఫ్రెండు. నాకు భయంగా వుంది మమ్మీ" అప్పటికే ఏడ్చేయడం ప్రారంభించింది.

"కృష్ణా, నే వెళ్ళిపోతున్నా, వాళ్ళని తీసుకుని నువ్వు రా" అంటూ చీకట్లో దారి తడువుకుంటూ బేబీని తీసుకుని బ్రతుకుజీవుడా అంటూ బయట పడింది పార్వతి.

రాత్రి భర్త యింటికి వచ్చేదాకా పార్వతి మనస్సులో ఏవేవో ఆలోచనలు. "ఏమిటీ భీభత్సం? ఎవరికోసం యీ రేప్ సీనులు? ఎందుకీ ఆడదాని శరీరం మీద యింతటి అత్యాచారాలు?" ఏవేవిటో పిచ్చి ప్రశ్నలు.

"ఏం పార్వతీ, నిద్రపోలేదా?" లైటార్పి పక్కనే పడుకుంటూ అడిగాడు కృష్ణమూర్తి.

"ఇంకా ఆ సినిమా గురించే ఆలోచిస్తున్నావా?" నడుం మీద చేయివేస్తూ అడిగాడు.

"కృష్ణా!" అంటూ అతనివైపు తిరిగింది పార్వతి.

"తల్లితండ్రుల ప్రేమకి ఫలితంగా పుడతారు పిల్లలు. అంతేగాని ఈ సినిమాల్లోలాంటి రేప్ వల్ల కాదని ఎలా చెప్పాలి బేబీకి?" అడిగింది.

కృష్ణమూర్తికి సమాధానం దొరకలేదు. మౌనంగా వుండిపోయాడు.

"చూశావా? మీ మగవాళ్ళకి జీవితం ఎంత సులభమో. ఇదే ప్రశ్న బేబీ నిన్ను అడిగితే మమ్మి నడుగు అనేస్తావు. కానీ మమ్మీ మటుకు? నేనిలాగే పుట్టానా? నేనందంగా పుట్టకపోతే పారేసేదానివా? అని అడిగే కన్నకూతురికి ఏంజవాబు చెప్తుంది ఆ మమ్మీ" నిట్టూర్చింది పార్వతి.

"అందుకే తల్లి పిల్లలని ముందునుంచీ సరైన దారిలో వుంచాలనే తాపత్రయపడుతుంది. ఆ ఆరాటం మీకు సిల్లీగా కనిపిస్తుంది. విశాలంగా ఆలోచించలేని వ్యక్తి చేష్టల్లాగా అనిపిస్తుంది కృష్ణా. ఈ 'ఏ' కాదు అసలు ప్రశ్న. ఆ అవసరాలేమిటన్నది కాని.." కృష్ణమూర్తి కూడా నిట్టూర్చాడు బదులు చెప్పలేక. జీవితమే సమస్యలమయంగా వుంటే ఈ వినోదం దాన్నింకా విషమం చేస్తూంది ఖర్మ అనుకున్నాడు. భార్యని దగ్గరిగా తీసుకుని కళ్ళు మూసుకున్నాడు.

COMMENTS